

మట్టి గణపతికే జై!

పర్యావరణవేత్తలు, ప్రభుత్వ ప్రచారంతో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే మండపాల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. 10లో



గాడిన పడుతున్న పారిశుద్ధ్యం

ముంపు ప్రాంతాల్లో చెత్తాచెదారం, బురద తొలగింపు పనులు కొలిక్కి రావడంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం 32° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆకాశం మేఘావృతమై జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

శభాష్.. డీఎఫ్‌ఓ సిద్ధార్థ్



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ విపత్తు వేళ మానవత్వం చాటుకున్నారు. మున్నేరు వరద ముంపుతో వేలాది మంది సర్వం కోల్పోగా సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్న ఆయన బాధితుల కష్టాలను కళ్లారా చూశారు. దీంతో కొంతైనా సాయపడాలనే భావనతో తన ఒక నెల వేతనాన్ని సీఎం ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు అందజేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు చెక్కు అందజేయగా, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు



జలగంనగర్ పాఠశాలలో పరిశీలిస్తున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్: ముంపునకు గురైన ప్రాంతాలు సహా అన్ని చోట్ల పాఠశాలలు సోమవారం పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మం నగరంతో పాటు రూరల్ మండలాల్లో ముంపునకు గురైన పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 71 పాఠశాలలు వరద ముంపునకు గురికాగా, బురద తొలగించే పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. కాగా, నయాబజార్ పాఠశాల ప్రహరీ కూలగా, ఇంకొన్నిచోట్ల కంప్యూటర్లు, సామగ్రి పాడైనందున అంచనా నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు చెప్పారు. ఖమ్మం రూరల్ ఎంఈఓ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంవైద్యవిభాగం: ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతూనే సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేఎంసీ పరిధిలో 60, మిగతా ప్రాంతాల్లో 805 బృందాలు ద్వారా 40,315 ఇళ్లను సందర్శించి 38,848 మందికి వైద్య సేవలు అందించాయని తెలిపారు. వీరిలో 725 మందికి జ్వరం, 62 మందికి డయేరియా సోకడంతో పాటు ఇంకొందరి పరిస్థితి విషమంగా ఉందని గుర్తించారని చెప్పారు. సుమారు పది వేల మందికి మందులు అందజేసి ఇద్దరిని జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో 20 ప్రత్యేక వైద్య శిబిరాలే కాక ఐదు మొబైల్ బృందాల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించామని, అధికార యంత్రాంగం అందుబాటులో ఉన్నందున ఎవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

రెక్కాడితేనే డొక్కాడేది..



పనికి పోలేక..

వెంకటేశ్వర నగర్ కాలనీకి చెందిన నడికొప్పుల అచ్చమ్మ నగరంలోని ఓ వస్త్రదుకాణంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. భర్త కూలి పని చేస్తాడు. తనకు వచ్చేది తక్కువ వేతనం కావడంతో అదే స్థాయిలో అద్దె ఉండే వెంకటేశ్వర నగర్‌లోని మున్నేటి ఒడ్డున ఇంట్లో ఉంటోంది. ఆమె అద్దెకు ఉండే ఇంటి పైకప్పు, సామానంతా వరదలో కొట్టుకుపోయింది. పని చేస్తే కానీ పూటగడవని వీరు వారం రోజులుగా ఇక్కడే ఉంటున్నారు. వండుకునేందుకు సామగ్రి, తినేందుకు సరుకులు లేక... దాతలు కూడా తమవైపు రావడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు.



వెంకటేశ్వరనగర్‌లో బురదమయమైన వంట పాత్రలను శుభ్రం చేస్తున్న నర్రి సుగుణ, ఆమె కూతురు

మున్నేరు ముంపులో పేద కుటుంబాలే 60 శాతం

- హమాలీలు, కూలీలు, ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం
- బురద తొలగిస్తూ ఇళ్ల వద్దే బాధితులు
- అటు పని లేక.. ఇటు సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని వేడుకోలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండలంలో మున్నేరు లోతట్టు ప్రాంతంలో నీట మునిగిన కాలనీలన్నీ రెక్కాడితే డొక్కాడని కుటుంబాలే. 60 శాతం కుటుంబాలు ఈ కేటగిరీకి చెందినవే. కొందరు వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలుగా, కూలీలుగా, ఇంకొందరు ఇళ్లల్లో పనులు చేసుకుంటూ, మరికొందరు తోపుడుబండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూ పనికి వెళ్తేనే ఆ కుటుంబాల జీవనం అంతంతమాత్రంగా సాగుతుంది. మున్నేరు పూర్తిగా ముంచడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బురదమయమైన తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటూ బాధితులు ఇళ్ల వద్దే ఉండడంతో పనికి వెళ్లే పరిస్థితి లేదు. ఆర్థికసాయం కోసం తమ ప్రాంతాలకు వచ్చిన వారిని బాధితులంతా వేడుకుంటున్నారు.

కూలీల అడ్డా..

మున్నేరు లోతట్టు ప్రాంతాలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సమీపంలోనే ఉంటుంది. ఈ మార్కెట్‌లోనే బాధిత కుటుంబాల్లో చాలామంది హమాలీలుగా, కొందరు మహిళలు స్వీపర్లుగా పనిచేస్తున్నారు. అలాగే తోపుడుబండ్లు, ఆటోమొబైల్ షాపులు, మెకానిక్ దుకాణాల్లో రోజువారీ, నెలవారీ వేతనంతో పనిచేస్తున్న వారు వేలాదిగా ఉంటారు. లోతట్టు ప్రాంతమంతా కూలీల అడ్డాగా ఉంది. ఈ ప్రాంతంలోనే ఎక్కువమంది నిరుపేదల నివాసాలు ఉన్నాయి. పట్టణంలో ఏ పెద్ద కార్యక్రమం జరిగినా ఇక్కడి నుంచే కూలీలు పనికి వెళ్తారు. తమ ఇళ్లన్నీ వరదముంపుతో బురదమయం కావడంతో శుభ్రం చేసుకునే పనిలో ఉన్నారు. ఎప్పుడు కుదుట పడతామో.. ఎప్పుడు కూలీ పనికి వెళ్తామో.. ఎప్పుడు తమ కుటుంబం సాధారణ స్థితికి వస్తుందో అని బాధితులంతా ఆవేదన చెందుతున్నారు.

కూలి చేస్తేనే కుటుంబం గడిచేది..

వెంకటేశ్వరనగర్‌కు నర్రి సుగుణ, యాదయ్య కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెల్లో ఒకరి పెళ్లి చేశారు. మిగతా వారు ఓ పెళ్లికి వెళ్లి ఇంటికి వచ్చే సరికి ఇంటిని వరద ముంచెత్తి సామగ్రి నీటి పాలయ్యాయి. రూ.20 వేలు పెట్టి నాలుగు క్వింటాళ్ల బియ్యం, రెండు, మూడేళ్లు పనికొస్తుందని పట్టించిన 15 కిలోల కారం అంతా నీటిపాలైంది.గత రెండు రోజుల నుంచి మంచినీళ్లు, ఆహారం అందించినా.. నేడు మాత్రం ఇప్పటివరకు ఎవరూ ఇవ్వలేదని, సామగ్రి శుభ్రం చేసుకుంటూ ఇక్కడే ఉన్నామని సుగుణ చెప్పింది. కట్టుబట్టలతో మిగిలిన తమకు ప్రభుత్వం ఇచ్చే రూ.10వేల సాయం ఎందుకూ పనికి రాదని చెబుతోంది. వరదతో ఇక్కట్లు పడుతున్న తల్లిని ఓదార్చేందుకు వచ్చిన పెద్దకుమార్తెను చూడగానే సుగుణ బోరున విలపించింది.

● పునరావాస కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం!

ఎక్కడైనా విపత్తులు ఎదురైతే నిరాశ్రయులకు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వసతి కల్పిస్తారు. కానీ మున్నేటికి వచ్చిన వరదతో ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాలోని ఎంపీడీఓ కార్యాలయంలోకి నీరు చేరింది. దీంతో నాయుడుపేట జంక్షన్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తాత్కాలికంగా కార్యాలయాన్ని తరలించారు. రెండు టేబుళ్లు, ఓ కంప్యూటర్ ఏర్పాటుచేసి ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సహాయనిధికి రూ.30వేలు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న విజయనగర్ కాలనీవాసులు

ఖమ్మంవన్‌టౌన్: మానవ సేవే మాధవసేవ అన్నానుడిని ఖమ్మంలోని విజయనగర్ కాలనీలోని సాయిగణేష్ టవర్స్ వాసులు నిజం చేశారు. అపార్ట్‌మెంట్‌లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు వారు రూ.30వేలు సేకరించారు. ఇంతలోనే మున్నేటికి వరద రావడంతో వరద బాధితులను ఆదుకునేందుకు ఉపయోగించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, కాలనీవాసులు నాయుడు జనార్దన్‌రావు, పి.కృష్ణయ్య, శివరామకృష్ణ, గాలయ్య, సామంత్, గోపు వేణు పాల్గొన్నారు.

చిన్నారుల దాతృత్వం

తల్లిదండ్రులు దాచుకొమ్మని ఇచ్చిన నగదును పిల్లలు మున్నేరు వరద బాధితుల కోసం అందజేశారు. ఈమేరకు రూ.23వేల నగదును రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేసి అభినందనలు అందుకున్నారు. నగదు ఇచ్చిన వారిలో మేయర్ నీరజ మనవడు, మనవరాలు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మనవడు, మనవరాలు ఉన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 9న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి తెలిపారు. డేటా సైన్స్‌లో 25, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 20, లైఫ్ సైన్సెస్‌లో ఐదు, బీకాం వివిధ కేటగిరీల్లో ఆరు, బీఏలో మూడు సీట్లు ఖాళీ ఉన్నాయని వెల్లడించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. వివరాలకు 94910 63083, 96409 47467 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కొట్టుకుపోయిన వాహనాలపై సర్వే

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు వచ్చిన వరదతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలాల్లోకి పలుచోట్ల ఇళ్లు, సామగ్రితోపాటు వాహనాలు కూడా కొట్టుకుపోయాయి. బైక్‌లు, కార్లు, ఆటోలు కొట్టుకుపోగా కొన్ని లభించాయి. మిగతా వాటి పరిస్థితి తెలియక బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యాన పోలీస్ యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి ఎవరెవరి వాహనాలు కొట్టుకుపోయాయో ఆరా తీస్తున్నారు. వాహన యజమాని పేరు, రిజిస్ట్రేషన్ నంబర్, సెల్ నంబర్ నమోదు చేస్తున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి చౌహాన్, పక్కన మరో మంత్రి సంజయ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పిన కేంద్ర మంత్రులు
- కేంద్రం చేయూతనివ్వాలని కోరిన భట్టి, పొంగులేటి, తుమ్మల



నానుతండా వద్ద పొలంలో ఇసుక మేటను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్

కూసుమంచి: వరదలతో నష్టం జరిగిందని రైతులు కంటనీరు పెట్టొద్దు.. అందరం అండగా నిలిచి కష్టాల నుంచి బయట పడేస్తామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రైతులకు ధైర్యం చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి కూసుమంచి మండలానికి వచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి హెలికాప్టర్‌లో నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా పాలేరు వాగు వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలించగా జరిగిన నష్టాన్ని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. అనంతరం పాలేరు వద్ద ఎడమ కాల్వకు పడిన గండి, నానుతండాలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఆతర్వాత వరద నష్టంపై ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాద్ జిల్లాల అధికారులు నవోదయ విద్యాలయలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ మాట్లాడుతూ రైతుల నష్టాలు, కష్టాలను కళ్లారా చూశానని, తెలుగు రాష్ట్రాల్లో భారీ పంట నష్టం జరిగిందని మంత్రి చౌహాన్ తెలిపారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించి రైతులు తిరిగి వ్యవసాయం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కృషి చేస్తామని చెప్పారు. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందించనున్నందున రైతులు ధైర్యంగా నిలిచి ముందుకు సాగాలని సూచించారు.

రాష్ట్రానికి అండగా నిలవండి

భారీ వరదలతో రాష్ట్రంలో 4లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. పంటలతో పాటు కాలువలకు కూడా భారీగా నష్టం ఏర్పడిందని.. రూ.కోట్లలో నష్టం జరిగినందున కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అండగా నిలవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీ వరదలతో తెలుగు రాష్ట్రాల్లో కనీవినీ ఎరుగని నష్టం వాటిల్లిందన్నారు. ఈ పరిస్థితిని స్వయంగా చూసిన కేంద్ర మంత్రులు రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రిగా, ఎంపీగా సేవలందించిన చౌహాన్‌కు ప్రజల, రైతుల కష్టాలు తెలిసినందున అండగా నిలుస్తారని నమ్మకముందని తెలిపారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, తాండ్ర వినోద్‌రావు, గల్లా సత్యనారాయణ, చావా కిరణ్‌కుమార్, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన టెంట్

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్న కేంద్ర మంత్రులు జుజ్జుల్‌రావుపేట రైతుల పొలాలను పరిశీలిస్తారని తొలుత వెల్లడించారు. అయితే, ఉదయంకల్లా పాలేరులోని పార్కుల వద్ద కేంద్రమంత్రులతో రైతుల ముఖాముఖికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సమావేశం కోసం ఓ షామియానా, ఫొటో ఎగ్జిబిషన్ కోసం మరో షామియానా, కుర్చీలు, ఇతరత్రా అంతా సిద్ధం చేశారు. ఇంతలోనే మంత్రులు హెలికాప్టర్‌లో నాయకన్‌గూడెం వస్తుండగానే భారీగా వర్షం రావడంతో టెంట్ కూలిపోయింది. దీంతో వేదికను అప్పటికప్పుడు నవోదయ విద్యాలయకు మార్చారు. ఇక కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ హిందీలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా కేంద్ర వ్యవసాయ శాఖ సెక్రటరీ తెలుగులో అనువదించారు. కానీ ఆ అధికారికి కూడా తెలుగు సరిగ్గా రాకపోవడంతో హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు.

పంట నష్టం 3,250 ఎకరాల్లోనేనట..

ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో 3,250 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలో తేల్చారు. 2,560 మంది రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి, మొక్కజొన్న, పెసర, మిర్చి, అరటి, బొప్పాయి పంటలకు నష్టం జరిగిందని అయితే, వరద వచ్చిన సమయాన 46,374 మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కానీ సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈమేరకు 2,560 మంది రైతులకు 3,250 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రాథమిక నివేదికకు, తుది నివేదికకు భారీగా తేడా ఉండడం.. పరిహారంపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రకటన చేయకపోవడంతో నష్టపోయిన రైతులకు న్యాయం జరుగుతుందా, లేదా అన్నది తెలియడం లేదు. అయితే, శుక్రవారం జిల్లాలో పర్యటించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాత్రం రైతులకు అండగా నిలుస్తామని, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అన్నదాతలకు రైతులకు ఎలా మేలు చేయాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పిన నేపథ్యాన త్వరలోనే సాయంపై ప్రకటన వస్తుందని భావిస్తున్నారు.

వినాయకుడికి మున్నేటి విఘ్నం

- వరద తాకిడితో మండపాలకు బ్రేక్
- ముంపు ప్రాంతాల్లో ఏటా ఘనంగా నవరాత్రులు
- ఈ ఏడాది విపత్తుతో తగ్గనున్న 500 మండపాలు
- ఇప్పటికే విగ్రహాలను బుక్ చేసినా ప్రతిష్ఠాపనకు వెనకడుగు



గత ఏడాది విగ్రహం ప్రతిష్ఠించిన వెంకటేశ్వర కాలనీ సెంటర్‌లో ప్రస్తుత పరిస్థితి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అందరి విఘ్నాలను తొలగించే వినాయకుడికి ఈ మున్నేరు వరద విఘ్నాలను సృష్టిస్తోంది. ముంపు కాలనీల్లో ఏటా నవరాత్రులు వేడుకగా జరిగేవి. ఈసారి ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లో మున్నేటి విషాదంతో భక్తులు దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో దాదాపు 60 కాలనీల్లో వినాయక చవితి శోభ కనిపించడం లేదు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతాల్లో ఏటా 500 వరకు విగ్రహాలు పెట్టేవారు. ఈసారి కూడా విగ్రహాల కొనుగోలు, ఉత్సవాల నిర్వహణకు నగదు సేకరించుకుని అడ్వాన్స్‌లు కూడా ఇచ్చారు. ఇంతలోనే వరద ముంచేయడంతో బురద, చెత్తాచెదారంతో దుర్వాసన వెదజల్లుతుండగా పూజలు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని చవితి శోభ

గతంలో వినాయక చవితి సమయానికి మున్నేరు పరీవాహక ప్రాంతాలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు కాలనీలు, ఇళ్లల్లో బురద మేటలు వేయగా.. ఇప్పుడిప్పుడే ఇళ్లల్లో ఉండే పరిస్థితులు కానరావడం లేదు. మున్నేరు ముంపు ప్రాంతమంతా విషాదం నెలకొనడంతో ఇళ్ల శుభ్రం చేసుకోవడం, దాతలు ఇచ్చే సాయం కోసం ఎదురు చూడడంతోనే సరిపోతోంది. దీంతో వినాయక చవితి శోభ కనిపించడం లేదు. మది నిండా భక్తి పారవశ్యం ఉన్నా.. నివాసం ఏర్పర్చుకున్నాక తొలిసారి వినాయక చవితి జరుపుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. అయితే, సర్వం కోల్పోయిన తాము ప్రాణాలతో మిగలడానికి దేవుడే కారణమని చెబుతున్నారు.

అడ్వాన్స్ ఇచ్చినా క్యాన్సిల్

మున్నేరు లోతట్టు ప్రాంత కాలనీల్లో యువత, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు. 10 నుంచి 12 అడుగుల వరకు ఎత్తయిన విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు విగ్రహాల కొనుగోలుకు పలుచోట్ల అడ్వాన్స్ కూడా ఇచ్చారు. ఇప్పుడు వరదతో కట్టుబట్టలే మిగలడంతో వినాయక చవితి నిర్వహించే పరిస్థితి ఆర్డర్లు క్యాన్సిల్ చేసుకున్నారు. అయితే, కొందరు విగ్రహాల అమ్మకందారులు కూడా నష్టపోవడంతో వారిని డబ్బు అడిగే పరిస్థితి లేక వెనుకాముందు ఆలోచిస్తున్నారు. ఖమ్మం నగరం, రూరల్ మండలాలు కలిపి గత ఏడాది 1,500 వరకు విగ్రహాలు పెడితే.. ఈసారి ముంపు కాలనీల్లో 500 విగ్రహాల మేర తగ్గే అవకాశముందని తెలుస్తోంది.

ముంపుతో కళతప్పింది..



ఏటా మండపాల ఏర్పాటుతో కళ ఉండే ప్రాంతంలో ఈసారి వరదతో చాలాచోట్ల విగ్రహాలు పెట్టడం లేదు. నవరాత్రోత్సవాల కళకు తోడు మున్నేటిలో నిమజ్జనం ఉండడంతో సందడి కనిపించేది. కానీ ఇప్పుడు కట్టుబట్టలతో బయటపడిన ప్రజలు అదే ఆవేదనతో ఉన్నారు.

– వినోద్ లాహోటి, స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు

ఘనంగా చేయాలనుకుని...



మా సెంటర్‌లో నాలుగేళ్లు విగ్రహం పెట్టాం. ఐదోసారి ఘనంగా నవరాత్రులు చేద్దామనుకుని విగ్రహానికి అడ్వాన్స్ ఇచ్చాం. ఇంతలోనే వరద ముంచేసింది. మదినిండా భక్తి ఉన్నా.. మండపం పెట్టలేకపోతున్నామన్న బాధ ఉంది. మదిలోనే వినాయకుడిని తలుచుకుంటాం.

– మేకినేని ప్రణయ్‌రావు, జలగంనగర్, ఖమ్మం రూరల్ మండలం

24 ఏళ్లుగా పెట్టాం..



24 ఏళ్లుగా వినాయక మండపం ఏర్పాటు చేసి పూజిస్తున్నాం. ఈసారి 25ఏడుకు గుర్తుగా 25 అడుగుల విగ్రహం పెట్టాలనుకున్నాం. కానీ వరద ముంచేయడంతో ఉత్సవ కమిటీ సభ్యుల ఇళ్లు దెబ్బతిన్నాయి. అంతా సర్వం కోల్పోయి ఇళ్లు శుభ్రం చేసుకునే పనిలోనే ఉన్నారు.

– కాటం సంపత్‌కుమార్, వెంకటేశ్వర నగర్, ఖమ్మం

క్లుప్తంగా

కేంద్ర మంత్రులకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: వరదలతో నష్టపోయిన ప్రజలు, రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకుడు తాండ్ర వినోద్‌రావు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్‌చౌహాన్, బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు పంటలు కోల్పోగా, ప్రజలు వరద ముంపుతో కట్టుబట్టలతో మిగిలారని తెలిపారు. నాయకులు నంబూరి రామలింగేశ్వరావు, శ్యామ్‌రాథోడ్, నున్నా రవి, రుద్ర ప్రదీప్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తల్లాడ: మండలంలోని కలకొడిమకు చెందిన ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెడు వ్యసనాలకు బానిసైన బీరెల్లి చార్లెస్(25) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడు...

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన కె.పేతూరు(60) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటయ్యాక గమనించిన కుటుంబీకులు నేలకొండపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగాఅప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గత రెండు రోజులుగా ఆయన మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవ పడుతున్నట్లు తెలిసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని వాల్యాతండా సమీపాన ఆకేరు ఏటి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం ఆయన మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి చేతిపై 'మేరీ లవ్ కృష్ణ' అని పచ్చబొట్టు ఉంది. ఈమేరకు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి ఆయన ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

రూ.3.43కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం బ్యాంక్ కాలనీకి చెందిన ఫర్టిలైజర్ డీలర్ నూతలపాటి రవి రూ.3,43,02,492కు దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. పురుగుల మందులు, విత్తనాల వ్యాపారం చేసిన ఆయన ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తులు, మనీ లోన్ యాప్‌లు, క్రెడిట్ కార్డుల ద్వారా అధిక మొత్తంలో అప్పులు చేశాడు. ఆపై నష్టం వచ్చి అప్పులు తీర్చే మార్గం లేదంటూ 32 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

వివాహితపై అత్యాచారం

చింతకాని: మండలంలోనిచిన్నమండవకు చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి నాలుగు రోజుల క్రితం అత్యాచారం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఘటనకు అవమానంగా భావించిన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరగా ఆస్పత్రిలో చేర్పించామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

వృద్ధురాలిపై దాడి.. గొలుసు అపహరణ

తిరుమలాయపాలెం: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని నమ్మించి దాడి చేసి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన 70 ఏళ్ల చామకూరి బక్కమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె వ్యవసాయ భూమిని రమణాతండా గ్రామానికి చెందిన నెర్సుల ఉప్పలయ్య కౌలుకు తీసుకోగా తరచుగా వచ్చివెళ్లేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన ఉప్పలయ్య ఆమెపై దాడి చేసి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయం కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో తలుపులు వేసి వెళ్లిపోయాడు. కాసేపటికి స్పృహలోకి వచ్చిన బక్కమ్మ చుట్టుపక్కల వారిని పిలిచి విషయాన్ని చెప్పింది. దీంతో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.జగదీష్ తెలిపారు.

మట్టి గణపతికే జై!

- పీఓపీతో పోలిస్తే ఈ విగ్రహాలకే ఆదరణ
- వివిధ సైజుల్లో అందుబాటులో మట్టి ప్రతిమలు
- గతంతో పోలిస్తే పెరిగిన విక్రయం



మట్టి విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న తయారీదారుడు

ఖమ్మంగాంధీచౌక్: గణేష్ మహారాజ్‌ను కొలిచేందుకు అంతా సిద్ధమయ్యారు. వినాయక చవితి సందర్భంగా శనివారం ఊరూవాడ మండలాలు సిద్ధమయ్యాయి. అయితే, ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే పీఓపీ విగ్రహాలు కాకుండా మట్టితో చేసిన విగ్రహాలు ప్రతిష్ఠించాలని ప్రభుత్వంతో పాటు పర్యావరణ వేత్తలు చాన్నాళ్లుగా కోరుతున్నారు. దీంతో ఏటా ఈ తరహా విగ్రహాలు పెరుగుతున్నాయి. ఈనేపథ్యాన పలు సంస్థలు భక్తులకు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుండడంతో ప్రజల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో తొమ్మిది అడుగుల వరకు మట్టి విగ్రహాలను విక్రయదారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. గంగానది మట్టితో కలకత్తాలో తయారు చేసిన విగ్రహాలను తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. మూడున్నర అడుగుల ఎత్తు విగ్రహాలు పూర్తిగా మట్టితో తయారు చేయగా, తొమ్మిది అడుగుల వరకు మట్టితో తయారుచేసిన విగ్రహాల్లో ఆధారం కోసం చెక్క ఫ్రేమ్‌లు, వెదురు, తాటి నార వినియోగించారు.

మండప నిర్వాహకుల ఆసక్తి

ప్రభుత్వాలు, పర్యావరణహితుల ప్రచారంతో ఉత్సవాల నిర్వహకుల్లో కూడా అవగాహన పెరిగి మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 1,600 విగ్రహాలను ప్రతిష్ఠించగా ఇందులో 400 మేర మట్టి విగ్రహాలే ఉన్నాయి. ఈ సారి సంఖ్య మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

చవితి సందడి

వినాయకచవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ఊపందుకున్నాయి. ఇటీవల వరదతో ముంపునకు గురైన ప్రాంతాలు మినహా మిగతా చోట్ల మండలపాలు సిద్ధమయ్యాయి. అలాగే, పత్రి, పూజ సామగ్రి అమ్మకాలతో పలుచోట్ల శుక్రవారం నుంచే సందడి నెలకొంది.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

పోలీసు శాఖ అనుమతితో నిర్వహించే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం సమకూరుస్తున్నారు. మండప నిర్వాహకులు పోలీస్ శాఖ రూపొందించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే దాని ఆధారంగా విద్యుత్ శాఖ కనెక్షన్ ఇస్తుందని స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, సౌండ్ సిస్టంకు మాత్రం చార్జీ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ముంపు బాధితులకు నిత్యావసరాలు



సరుకుల వాహనాలను ప్రారంభిస్తున్న పువ్వాడ, వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధితుల కోసం సిద్దిపేట నుండి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వాన పంపించిన నిత్యావసరాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. ఈ వాహనాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముంపు బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు, కార్పొరేటర్లు గుండాల కృష్ణ, కర్నాటి కృష్ణ, దండా జ్యోతిరెడ్డి, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు చేయూత

భారీ వరదతో ఇళ్లు ముంపునకు గురైన నష్టపోయిన జర్నలిస్టులకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చేయూతనిచ్చారు. శుక్రవారం ఆయన పలువురికి నిత్యావసర సామగ్రి అందజేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవితో పాటు వనం వెంకటేశ్వర్లు, మాటేటి వేణు, గుద్దేటి రమేష్‌బాబాబు, శ్రీను, యలమందల జగదీష్, బి.రాఘవ, చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపేందర్, రాజు, కొరకొప్పుల రాంబాబు, వెంకటకృష్ణ, సాయి, ఉత్కంఠం శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఖమ్మం సహకారనగర్: మున్నేటి తో సర్వస్వం కోల్పోయిన వివిధ ప్రాంతాల్లోని 200 పేదకుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యాన రూ.2లక్షల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, డీఈఓ ఈ.సోమశేఖరశర్మ ఈ సరుకులను పంపిణీ చేశాక ఎమ్మెల్సీ తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులు అందజేసిన విరాళాలతో ఈ సాయం చేశామన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటుబి.వెంకన్న, యూసుఫ్ సైదా, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, ఎల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డీఈఓ శర్మ

వరద ప్రాంతాల్లో ఎస్‌బీఐ మొబైల్ ఏటీఎం



మంచికంటి నగర్‌లో ఎస్‌బీఐ మొబైల్ ఏటీఎం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) శుక్రవారం నుంచి మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభించింది. ఈ వాహనాన్ని హైదరాబాద్ నుంచి ఎస్‌బీఐ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) రాజేష్‌కుమార్ వర్చువల్‌గా ప్రారంభించారు. మున్నేరు పరీవాహక వరద ప్రాంతాల్లో మొబైల్ వాహనం ద్వారా ఏటీఎం సేవలు అందుతుండగా, పలువురు వినియోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జి లింగస్వామి, బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం...

- రాజ్యసభ మాజీ సభ్యుడు వీహెచ్

ఖమ్మంవన్‌టౌన్: మున్నేరు వరద బాధితులకు అండగా నిలుస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హన్మంతరావు తెలిపారు. జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించిన ఆయన ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడారు. అనుకోని ఉపద్రవంతో జిల్లా అతలాకుతలం కాగా, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి క్షణం తీరిక లేకుండా బాధితులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ముందుచూపుతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరగలేదని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కూసుమంచి: పాలేరు వరద ప్రవాహంలో నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ – సైదాబీ దంపతులు మృతిచెందగా వారి కుటుంబాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పరామర్శించారు. మృతుల కుమారులకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, కార్పొరేటర్లు, నాయకులు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, రబ్బానీ, కె.నాగేశ్వరరావు, ముక్రమ్, రజ్జి, వీరయ్య, మహమూద్, ఖైసార్, మున్వర్, హఫీజుద్దీన్, కొత్తా సీతారాములు, బెల్లంకొండ శరత్, కిరణ్, వెంకన్న, రాంబాబు, సైదా, మీరా పాల్గొన్నారు.



డీసీసీ సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్

ప్రకాష్‌నగర్ వంతెనకు ఇరువైపులా గోడ

- కూల్చడానికి స్థానికుల యత్నం



గోడ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న స్థానికులు

ఖమ్మంక్రైం/ఖమ్మం రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మున్నేరు వరదతో ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై స్పాన్ బేరింగ్ పక్కకు జరగడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అయితే, ఇతర వాహనాలు కూడా రాకుండా ఇటు ఖమ్మంతో పాటు అటు ఖమ్మం రూరల్ వెంకటగిరి వద్ద శుక్రవారం అడ్డుగోడ నిర్మించారు. అయితే, గోడ నిర్మిస్తే తమకు ఇబ్బంది ఎదురవుతుందని వెంకటగిరి ప్రాంత వాసులు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఓ మహిళ గోడను కొద్దిమేర కూల్చివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ మేరకు పోలీసులు సర్దిచెప్పడంతో వెళ్లిపోయారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే కాల్వొడ్డు మున్నేరు వంతెనపై భారీ వాహనాలకు అనుమతి లేనందున భారీ వాహనాలన్నీ రాపర్తినగర్, కరుణగిరి వంతెనపై నుండి రాకపోకలు కొనసాగించాలని సూచించారు. కాగా, గోడ నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాక తొలగించేందుకు యత్నించిన కోటనారాయణపురానికి చెందిన స్వప్న, అఫ్జల్‌బీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

దూరం పెంచిన అడ్డుగోడ

ముదిగొండ: ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న వెంకటగిరి, ప్రకాష్‌నగర్ వాసులు నగరానికి రాకపోకలు సాగించేందుకు మున్నేటిపై ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి అందుబాటులో ఉండేది. ముదిగొండ, వెంకటగిరి, న్యూలక్ష్మీపురం, వెంకటాపురం, వల్లబి తదితర గ్రామాల వారే కాక నేలకొండపల్లి, కోదాడ, జగ్గయ్యపేట, తదితర ప్రాంతాల నుంచి ఈ బ్రిడ్జి మీదుగానే ఖమ్మం చేరుకుంటారు. ప్రస్తుతం రాకపోకలు నిలిపివేయడంతో ముదిగొండ మండల ప్రజలకు దూరం పెరగనుంది.

గాడినపడుతున్న పారిశుద్ధ్యం

- ముంపు ప్రాంతాల్లో 90 శాతం వ్యర్థాల తొలగింపు



బురదను ఎత్తుతున్న కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదతో ముంపు ప్రాంతాల్లో పేరుకున్న వ్యర్థాల తొలగింపు ఓ కొలిక్కి వస్తోంది. ఐదు రోజులుగా వందలాది మంది కార్మికులు, జేసీబీలు, ట్రాక్టర్లతో కాలనీలు, ఇళ్లల్లో పేరుకుపోయిన కర్రలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బురద, ఇళ్లలో పాడైన సామాన్లను డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. మున్నేరు పరీవాహకంలో 13 డివిజన్ల పరిధిలో వందలాది ట్రక్కుల వ్యర్థాలను తొలగించడంతో 90 శాతం మేర పనులు ముగిశాయి. కేఎంసీ కార్మికులతో పాటు వరంగల్, నల్లగొండ కార్పొరేషన్లు, ఇతర జీపీల కార్మికులు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇక రోడ్లపై పేరుకున్న వ్యర్థాలను జేసీబీలు, డోజర్లతో ఓ పక్కకు నెట్టి ట్రాక్టర్లలో తరలించారు. ఇంకొన్నిప్రాంతాల్లో రోడ్లపై మిగిలిన బురద తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కాగా, ముంపు కాలనీల్లో రోడ్లపై వ్యర్థాలు, బురద తొలగించగానే బ్లీచింగ్ చల్లిస్తున్నారు. అలాగే, దోమలు పెరగకుండా నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు టిమోపాస్ పిచికారీ చేయిస్తున్నారు. మరోపక్క డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపునకు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ నుండి వచ్చిన కార్మికులు శుక్రవారం రాత్రి వెళ్లిపోవడంతో కేఎంసీ కార్మికులతో పనులు చేయించనున్నారు. డ్రెయిన్లు శుభ్రం చేస్తే ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముగుస్తాయని అధికారులు వెల్లడించారు.

ముంపు ప్రాంతాల్లో ఎస్‌బీఎం డైరెక్టర్ పర్యటన

ఖమ్మం సహకారనగర్: వరద ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను రాష్ట్ర స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం) డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల, రాజీవ్ గృహ కల్ప కాలనీ, శ్రీరామ్‌నగర్, సాయిప్రభాత్ నగర్, టెంపుల్ సిటీ, జలగం నగర్, పెద్దతండా, కేబీఆర్ నగర్, ఆర్టీసీ కాలనీ, బీబీఎం స్కూల్, పోలేపల్లి, సాయి భారతి నగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల ఇళ్లకు వెళ్లి నష్టం వివరాలు ఆరా తీయడమే కాక ప్రభుత్వం నుండి అందిన సాయంపై తెలుసుకున్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాద్రి జిల్లా కరకగూడెం అటవీ ప్రాంతంలో గురువారం గ్రేహౌండ్స్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులను కాల్చి చంపడాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖండిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఈ ఘటనను ఖండించాలని కోరారు.

ఆదాయపు పన్నుపై అవగాహన

ఖమ్మంవ్యవసాయం: ఆదాయపు పన్ను సంబంధిత అంశాలపై ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిక చేసిన 50 పీఏసీఎస్‌ల కార్యదర్శులకు నాబార్డ్ సౌజన్యంతో దివి అండ్ కో చార్టెడ్ అకౌంటెంట్ కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. బ్యాంక్ సీఈఓ వి.వసంతరావు, అధికారులు ఎం.సర్వేశ్వర్‌రావు, జి.ప్రవీణ్, బి.చందర్‌రావు, రాధిక పాల్గొన్నారు.